సాక్షి
వికారాబాద్
శనివారం । 21 । జూన్ । 2025



యోగా సాధనతో ఆరోగ్యం

తనువు, మనసు, ఆత్మను ఏకం చేసే ఏకైక సాధనం యోగా. ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో ఇది ఒకటి. 10లో▸

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్‌లో యోగా డే

అనంతగిరి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో యోగా డే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరు కానున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు బంట్వారానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక

బంట్వారం: మండల కేంద్రానికి శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రానున్నట్లు ఎంపీడీఓ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కోట్‌పల్లిలో పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

తాండూరు: తాండూరు ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి 11 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తాండూరు ఆర్టీసీ డిపో పరిధిలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ

యాలాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు. మండలంలోని దేవనూరుకు చెందిన మెట్లి కృష్ణ, హాజీపూర్‌కు చెందిన ఇస్మాయిల్, మెట్లకుంటకు చెందిన బాల్‌రాజ్ ఇటీవల తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. యాలాల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని శుక్రవారం బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్యాణ మండప పునర్నిర్మాణానికి సహకరిస్తా



అగ్ని ప్రమాదానికి గురైన కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు: వీరశైవ సమాజం సభ్యుల కోసం నిర్మించిన కల్యాణ మండపం అగ్ని ప్రమాదానికి గురి కావడం బాధాకరమని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి ప్రమాదానికి గురైన మండపాన్ని సందర్శించి అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్యాణ మండప పునర్నిర్మాణానికి రూ.20 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీర శైవ సమాజం అధ్యక్షుడు ఆర్ బస్వరాజ్, గౌరవాధ్యక్షుడు వాలి శాంతుకుమార్, నాయకులు టీ చంద్రశేఖర్, గణపురం శంకర్, ఎస్ చంద్రశేఖర్, రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

27నుంచి ధ్రువపత్రాల పరిశీలన

అనంతగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్ విడుదలైనట్లు వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ముందుగా కౌన్సిలింగ్ రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు స్లాట్ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డు, ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



దోమ: దెబ్బతిన్న పాఠశాల పైకప్పు రేకులు



మర్పల్లి: అపరిశుభ్రంగా బూచన్‌పల్లి పాఠశాల ఆవరణ

బడి దుడుకులు

సమస్యలకు నిలయంగా సర్కారు స్కూళ్లు

- పెచ్చులూడుతున్న భవనాలు
- కొరవడిన శుభ్రత, ప్రహరీల కరువు
- జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,063
- విద్యార్థులు 80వేల మంది

వికారాబాద్: పాఠశాలలు పునఃప్రారంభమై వారం గడిచినా ఇంకా సమస్యలు కొలిక్కి రాలేదు. స్కూల్ భవనాలు, వసతుల కల్పన కోసం మన ఊరు – మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలలు పేరిట పనులు చేపట్టినా అనుకున్న మేర ఫలితం ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా 1,063 పాఠశాలలు ఉండగా ఇందులో 80వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 187 బడుల్లో వివిధ మరమ్మతు పనులు అవసరమని అధికారులు తేల్చారు. శుక్రవారం జిల్లాలోని పలు పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగు చేశాయి. అనేక బడుల్లో పెచ్చులూడుతున్న పైకప్పులు కనిపించాయి. ప్రహరీలు లేకపోవడం, మరుగుదొడ్లు, మూత్రశాలలు అపరిశుభ్రతంగా దర్శనమిచ్చాయి. మరికొన్ని చోట్ల విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు లేవు. చెడిపోయిన ట్యాప్‌లు కనిపించాయి. గేట్లు లేకపోవడంతో స్కూల్ వదిలాక ఆకతాయిలు చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పాఠశాలల ఆవరణల్లో గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు, తేళ్లు తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

- వివరాలు 11లో▸

ఇసుక తోడేళ్లు

కాగ్నా నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా

- రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా..
- అక్రమార్కులకు అధికార పార్టీ నాయకుల అండదండలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



ఇసుక తోడేయడంతో కాగ్నా నదిలో ఏర్పడిన గుంతలు

తాండూరు రూరల్: నియోజకవర్గంలో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల మధ్య ఉన్న కాగ్నా వాగు నుంచి రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుకను తోడేస్తుండటంతో భూగర్భజలాలు పడిపోతున్నాయని సమీప గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమార్కులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు సిబ్బంది కొరత కారణంగా చేతులెత్తేస్తున్నారు.. పోలీసులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తాండూరు మండల పరిధిలోని గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల మధ్య కాగ్నా వాగు ప్రవహిస్తోంది. ఈ వాగులో ఇసుక పుష్కలంగా ఉండటంతో అక్రమార్కుల కన్ను పడింది. వర్షాలు పడకపోవడంతో ఇదే అదనుగా భావించిన కొందరు రాత్రి వేళ ట్రాక్టర్లతో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గోనూర్‌కు చెందిన ఓ యువ నాయకుడి అండదండలతోనే ఈ తతంగం నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటే నాయకులు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం . దీంతో మాకెందుకులే అన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. గతంలో ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించి కేసులు నమోదు చేసినా దందా ఆగడం లేదు.

చీకటి పడితే చాలు..

రాత్రి 9 గంటలైతే చాలు కాగ్నా వాగు నుంచి ఇసుక తరలింపు మొదలవుతుంది. తెల్లవారుజామున ఆరు గంటల వరకు యథేచ్ఛగా తరలిస్తారు. ఇసుక ట్రా క్టర్ల కారణంగా రాత్రి నిద్ర పట్టడం లేదని గోనూర్, వీర్‌శెట్టిపల్లి ప్రజలు తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పలు ప్రాంతాలకు తరలింపు

కాగ్నా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. బషీరాబాద్ మండలంలోని కాశింపూర్, మల్కాన్‌గిరి, రెడ్డిఘనాపూర్ తోపాటు తాండూరు పట్టణానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల వర కు విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

హైకోర్టు స్టే ఉన్నా..

గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల శివారులోని కాగ్నా వాగు నుంచి ఇసుక అరలింపునకు అనుమతి ఇవ్వరాదని కొన్నేళ్ల క్రితం హైకోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీంతో రెవెన్యూ అధికారుల పర్మిషన్ ఇవ్వడం లేదు. కానీ అక్రమార్కులు ఇవేవీ లెక్క చేయడం లేదు. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక దందా సాగిస్తున్నారు. జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించి కట్టడి చేయాలని ఆ రెండు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. లేకుంటే భూ గర్భజలాలకు ముప్పు తప్పదని వారు పేర్కొన్నారు.

అనుమతి లేదు

గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రా మాల శివారులోని కాగ్నా నది నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వడం లేదు. పర్మిషన్ లేకుండా ఇసుక తరలిస్తున్నట్లుమా దృష్టికి వచ్చింది. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరత కారణంగా తనిఖీ చేపట్టలేకపోతున్నాం. ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

ప్రతి గడపకూ సంక్షేమం

- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో 312 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు, 27 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎన్నికల హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చొరవ చూపుతుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నాలుగు దశల్లో నిర్మాణ బిల్లులు రూ.5 లక్షలు జమ చేస్తామని వివరించారు. పేదలు కడుపునిండా అన్నం తినాలనే మంచి ఆశయంతో దేశంలోనే మొదటి సారిగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ అవుతోందని తెలిపారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. త్వరలో పంచాయతీ, ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరవుతాయని వివరించారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్, ఏఓ జయశంకర్, ఎంపీఓ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సురేందర్, నరోత్తం రెడ్డి, మహంత్‌స్వామి, సిరాజొద్దీన్, నర్సింలు, విఠల్, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాణయ్య, రవి, వెంకటయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

263 మందికి పత్రాలు

మర్పల్లి: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆకుల రాజేందర్ ఫంక్షన్ హాల్‌లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్‌రెడ్డితో కలిసి మండలంలోని 263 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. మరో 40 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండుగ లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పేదలకు ఇళ్లు మంజూరు చేసి వారి గుండెల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, ఖలీమొద్దీన్, శంకరయ్య గౌడ్, సంజీవరెడ్డి, గణేశ్, నాగేశ్, రవీందర్, ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, మండల ప్రత్యేకాధికారి మోహన్‌కృష్ణ, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



అధ్యాపకులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

'నీట్, ఐఐటీ'కి సన్నద్ధం చేయండి

- జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్

పరిగి: ఇంటర్ విద్యార్థులను నీట్, ఐఐటీ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ సూచించారు.శుక్రవారం పరిగి పట్టణం తుంకుల్‌గడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా లో ఉత్తమ ఫలితాలు సాధించి మంచి పేరు తెచ్చుకుందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అడ్మిషన్ల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్య తోపాటు స్కాలర్‌షిప్ సదుపాయం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల కంటే మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ విషయాలు తెలియజేసి కళాశాలలో చేర్పేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు భాస్కర యోగి, రాజ్‌కుమార్, సతీష్, వరస్వామి, గోపాల్, ప్రభాకర్, రవి, వెంకటేశ్, గణేశ్, బాలగణేశ్, మమత పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

అనంతగిరి: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లి, అనంతగిరిపల్లి గ్రామాల్లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. వికారాబాద్ మున్సిపాలిటీ, మండలం నుంచి దాదాపు 1,400 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, ఎంఆర్ఐ నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ మున్సిపల్‌కు మహర్దశ

- రూ.300 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు
- సుందరంగా మారనున్న పట్టణం



కొడంగల్ మున్సిపల్ కార్యాలయం

కొడంగల్: కొడంగల్ మున్సిపాలిటీకి మహర్దశ పట్టింది. ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. తాజాగా శుక్రవారం కొడంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బాలరాం నాయక్ తెలిపారు. పట్టణంలోని వినాయక చౌరస్తాలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.తాగునీటి సరఫరాకు రూ.2.50 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.66.72 కోట్లు, వర్షపు నీటి పారుదల వ్యవస్థకు రూ.57.67 కోట్లు, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థకు రూ.7.09 కోట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.78 కోట్లు, ఇతర ఖర్చులు రూ.66.50 కోట్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.6.67 కోట్లు మంజూరు చేశారు.

అభివృద్ధిలో ఆదర్శం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గా న్ని అభివృద్ధిలో ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ.10 వేల కోట్ల తో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.300 కోట్లు మంజూరు చేశారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో పనులు త్వరగా పూర్తి చేస్తాం.

– నందారం ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షుడు, కొడంగల్

స్కూల్ బస్సులపై ప్రత్యేక నిఘా

- విద్యార్థుల రవాణాలో నిర్లక్ష్యం వద్దు
- ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు, వ్యాన్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ నారాయణరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యం వహించరాదని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు సూచించారు. లైసెన్స్ ఉన్న వ్యక్తులనే డ్రైవర్లుగా నియమించాలి ఆదేశించారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే వినియోగించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు (రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పర్మిట్, కాలుష్య నియంత్రణ పత్రం, పీయూసీ) సక్రమంగా ఉండాలన్నారు. లేకుండా సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్ల చిరునామా, ఫోన్ నంబర్లు, పోలీస్ వెరిఫికేషన్ నివేదిక తప్పనిసరిగా ఉంచుకోవాలని పాఠశాలల యాజమాన్యానికి సూచించారు. డ్రైవర్ల ప్రవర్తనపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదన్నారు. నిర్ణీత వేగంతో వాహనాన్ని నడపాలని సూచించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి వాహనంలో తప్పనిసరిగా మహిళా సహాయకులు లేదా కేర్ టేకర్ ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడానికి హెల్ప్‌లైన్ నంబర్లను వాహనం వెలుపల స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని పాఠశాలల బస్సులు, వ్యాన్లను ఆర్‌టీఏ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. నిబంధనల ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు.



పరిగి: స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వీరేంద్రనాయక్, ఎస్సై సంతోష్‌కుమార్

ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే చర్యలు: ఎంవీఐ వీరేంద్రనాయక్

పరిగి: ప్రైవేటు స్కూల్ బస్సులకు అన్ని ధ్రువపత్రాలు ఉండాలని పరిగి ఎంవీఐ వీరేంద్రనాయక్ ఆదేశించారు. శుక్రవారం పరిగి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే సంబంధిత పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కండీషన్‌లో లేని బస్సులను నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావున ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే విద్యార్థుల రవాణాకు వినియోగించాలని సూచించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగిస్తే రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ఆలస్యం చేస్తే సహించేది లేదన్నారు. నిబంధనల ప్రకారం బస్సులు నడపాలన్నారు. హెవీ లైసెన్స్ ఉన్న డ్రైవర్తే స్కూల్ బస్సులను నడపాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

కుల్కచర్ల: పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రామ్మోహన్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి, నీర్‌సాబ్ తండా, కొత్తపల్లి తండాలలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందించడంతో పాటుగా పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, శేఖర్, వెంకటయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత

పరిగి: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన శ్రీశైలం శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. తన తండ్రి జ్ఞాపకార్థంగా ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తాను నిరంతరం కృషి చేస్తానని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమ: మండల పరిధిలోని దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు విద్యుత్‌లో అంతరాయం కల్గుతుందని ఏఈ జి.వినయ్‌కాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 132 కేవీ నుంచి రాపోల్‌లోని 33 కేవీ సబ్‌స్టేషన్ వరకు చెట్ల కొమ్మలు తొలగింపు జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

కొడంగల్‌ను అభివృద్ధి చేయండి

ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్

కొడంగల్ రూరల్: గజ్వేల్, సిరిసిల్ల మాదిరిగా కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తాలను విస్తరిస్తామని నామమాత్రపు పనులతో చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. శిథిలావస్థకు చేరిన షాదీ ఖానాను నూతనంగా నిర్మిస్తామని నిధులు మంజూరైనట్లు ప్రొసీడింగ్ చూపిస్తూ మభ్య పెడుతున్నారన్నారు. రూ.కోట్లాది మంజూరు చేస్తున్నామంటున్న ప్రభుత్వం కొడంగల్‌లో అభివృద్ధి మాత్రం కాగితాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు.

వెలగని హైమాస్ట్ లైట్లు

దుద్యాల్: హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో మండలంలోని హస్నాబాద్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట స్థానిక గాంధీ చౌక్‌లో ఉన్న హైమాస్ట్ దీపాలు పనిచేయకపోవడంతో అంధకారం అలుముకుంది. దీంతో దైనందిన కార్యక్రమాలకు అవరోధంగా మారాయి. కారుచీకట్లలో ఏం పనులు చేయాలన్న పెద్ద సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాంధీ చౌరస్తాలో వెలగని లైట్లు

ట్యాంక్ నిండి.. వృథాగా పారి



రోడ్డుపై పారుతున్న నీరు

పూడూరు: మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పూడూరు మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో ఉన్న ట్యాంకు నిండి తరచూ నీరు రోడ్డుపైనే పారుతుంది. కుళాయిల్లో నీరు రాక ఇబ్బందులు పడుతూ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఈ రోడ్డుపై నుంచి వెళ్లే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని కాలనీకి నీరు ఇవ్వాలని కోరుతున్నారు.



పద్మాసనం వేసిన విద్యార్థులు



స్థూలకాయ నియంత్రణకు సంబంధించిన ఆసనం

యోగా సాధనతో ఆరోగ్యం

పల్లెల్లో సైతం పెరిగిన ఆసక్తి

- శరీర రుగ్మతలకు చెక్
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

దుద్యాల్: తనువు, మనసు, ఆత్మను ఏకం చేసే ఏకైక సాధనం యోగా. ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో ఇది ఒకటి. మనిషి మానసిక ప్రశాంతత, వికాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో మేలు చేస్తోంది. మనసు, శరీరాన్ని ఏకం చేసి ఆధ్యాత్మికతను అందిస్తుంది. భారతదేశంలో వేదకాలం నుంచే ఉందని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి. దీన్ని ప్రతీరోజు ఆచరించేవారిలో క్రమశిక్షణతో కూడిన జీవనం అలవడుతుంది. నిత్యం క్రమం తప్పకుండా తెల్లవారుజామునే యోగాసనాలు సాధన చేస్తే చాలా మంచిది. దాన్ని ఒక దినచర్యగా అలవర్చుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవితంలో చాలా మంది శారీరక వ్యాయామం లేక అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లోని పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. సామాన్య ప్రజలు కూడా సులభంగా నేర్చుకుంటున్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలను దూరం చేయొచ్చు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులకు యోగా నేర్పిస్తున్నారు. దీంతో పల్లె ప్రాంతాల్లో కూడా ప్రాధాన్యం పెరిగింది.

దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ

యోగాతో బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, ఆస్తమా, గ్యాస్ట్రబుల్, సయాటికా, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, మలబద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టొచ్చని శిక్షకులు చెబుతున్నారు. యోగాతో నిత్యం ఆరోగ్యంగా ఉండొచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలతో డాక్టర్లను సంప్రదిస్తే వారిచ్చే సూచనల్లో యోగా చేయాలని నొక్కి చెబుతున్నారు. ఇలా అనేక రకాల ఉపయోగాలు పొందొచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాధన మంచిది

కొడంగల్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు శ్యామలయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలన్నారు. రోజు ఉదయం పూట కొంత దూరం నడిస్తే ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. మనిషి జీవనం యాంత్రికంగా మారిందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే జీవితంలో సహజ పద్ధతులు పాటించాలన్నారు.



తాండూరులో 296 అర్జీలు

ముగిసిన రెవెన్యూ సదస్సులు



తాండూరురూరల్: సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. మండలంలో 33 గ్రామాల్లో 14 రోజుల పాటు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ బృందాలుగా ఏర్పడి దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారం ఆఖరు రోజు తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణంలోని పాత తాండూరు, మల్‌రెడ్డిపల్లి, సాయిపూర్ ప్రాంతంలోని రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 296 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ లలిత, ఆర్‌ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి..

బంట్వారం: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎన్నారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అందజేసిన 21 దరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో 205 దరఖాస్తులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలో రెవెన్యూ సదస్సుల్లో 205 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ చెప్పారు. పెద్దేముల్, రుద్రారం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 14 రోజుల పాటు ఆయా గ్రామాల్లో తహసీల్దార్, డీటీలు రెండు బృందాలు ఏర్పడి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

బొంరాస్‌పేటలో 425

బొంరాస్‌పేట: మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో శుక్రవారం ముగింపునాటికి 425 దరఖాస్తులు వచ్చాయి. ముగింపురోజు మండల పరిధిలోని ఏర్పుమళ్ల గ్రామంలో నిర్వహించిన సదస్సులో 123 దరఖాస్తులు అందాయి. ఇందులో తహసీల్దారు పద్మావతి, ఆర్‌ఐలు శిరీష, రవి, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన

కుల్కచర్ల: రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి విశేష స్పందన వచ్చిందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అల్మాస్‌ఖాన్‌పేట్‌లో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన సదస్సులలో 1424 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, డీటీ చంద్రశేఖర్, గిర్దవరులు ఖాజ, రవి, నాయకులు గోపాల్‌నాయక్, శ్రీనివాస్, భరత్ కుమార్‌రెడ్డి, కృష్ణయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



కుల్కచర్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

కేంద్ర పథకాలను ప్రచారం చేయండి



తహసీల్దార్ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న నాయకులు

దోమ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నేతలు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకువచ్చి నేరుగా అందిస్తున్నారని తెలిపారు. ఉచిత రేషన్ బియ్యం, ఆయుష్మాన్ భారత్, రైతులకు మద్దతు ధర, కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్‌బీమా యోజన తదితర వాటిని అందిస్తుందన్నారు. కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్



మాట్లాడుతున్న చంద్రశేఖర్ ముదిరాజ్

తాండూరు: రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనులకు రాజ్యాధికారం సాకారమవుతోందని ఈ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తాండూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ దాగిల్లా దయానంద రావు, విశిష్ట అతిథులుగా లింగంపల్లి యాదగిరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీలలో ఒక సామాజిక వర్గం మాత్రమే ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. తాండూరు నియోజకవర్గంలో బహుజనుల సంఖ్య 70 శాతం ఉన్నప్పటికీ విద్యా, ఉద్యోగం, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల హక్కులు అందుతాయన్నారు. అందుకు కార్యకర్తలు గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, సయ్యద్‌అమీర్, ప్రభుకుమార్, బాల్‌రాజ్, అమ్జద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ అభియాన్‌ను వినియోగించుకోవాలి

కొడంగల్ రూరల్: టీబీ ముక్త్ అభియాన్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు బుష్రా సూచించారు. శుక్రవారం పట్టణంలోని వడ్డెరగల్లీ కాలనీలో నిర్వహించిన క్యాంపులో ఆమె సలహాలు, సూచనలు అందించారు. షుగర్, బీపీ, క్యాన్సర్ వచ్చినవారు, పాత టీబీ పేషంట్లు, కుటుంబసభ్యులు, పొగాకు తాగేవారి నుంచి శాంపిల్స్ తీసుకున్నామన్నారు. మొత్తం 110మంది స్క్రీన్ చేసి 38మందికి ఎక్స్‌రే చేశామన్నారు. దీంట్లో టీబీ పాజిటివ్ వచ్చిన వారికి 6 నెలలపాటు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీ డాక్టర్ అమృత, హెల్త్ అసిస్టెంట్ మధు, టీబీ సూపర్‌వైజర్లు రాహత్‌అలీ, సుశీల, ఏఎన్‌ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సెమ్స్ ఒలంపియాడ్ పరీక్షలో సత్తా చాటారు. రుత్విక్ స్టేట్ 3వ ర్యాంకు సాధించగా పావని, రక్షిత, సహస్ర, ఖ్యాతీలు జోనల్ స్థాయిలో ర్యాంకు సాధించారు. వీరిని పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందించి బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి ర్యాంకులు మరిన్ని సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న పాఠశాల అధ్యక్షుడు తదితరులు

బడి ఆవరణలో పాముల కలకలం

దుద్యాల్: మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం పాములు కలకలం రేపాయి. అక్కడే ఆడుకుంటున్న గ్రామానికి చెందిన విద్యార్థులు వాటిని గమనించి వెంబడించి చంపేశారు. పాఠశాల సమయం తరువాత పాములు ఆవరణలోకి రావడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. బడికి ఆనుకొని చెరువు ఉండడంతో తరచూ పాములు వస్తున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. మరోవైపు ప్రహరీ సైతం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మోమిన్‌పేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మోమిన్‌పేటలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. మండల పరిధిలోని చీమల్‌దరి గ్రామానికి చెందిన మ్యాతరి పర్మయ్య పని నిమిత్తం పొలానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమైంది. గమనించిన చుట్టు పక్కల వారు మంటలను ఆర్పారు. అప్పటికే ప్రమాదంలో తులం బంగారు నగలు, రూ.3.5లక్షల నగదుతో పాటు, విలువైన డాక్యుమెంట్లు కాలిపోయాయని బాధితుడు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ బడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

పరిగి: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మాస్టర్‌మైండ్ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్య లను కూడా ఏర్పాటు చేయకుండా ఎలా స్కూళ్లను నడుపుతారని ప్రశ్నించారు. అధికారులు పాఠశాలను సందర్శించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిగణేష్, అఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ ఎదుట సెల్ఫీ తీసుకున్న యువకుడిపై దాడి

మొయినాబాద్: వైన్ షాపు ఎదుట సెల్ఫీ తీసుకున్న ఓ యువకుడిపై యజమానితో పాటు సిబ్బంది దాడి చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన యువకుడు రాఘవేందర్‌రెడ్డి గురువారం సాయంత్రం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పెద్దమంగళారం రోడ్డులో ఉన్న వైన్స్‌కు వెళ్లాడు. షాపు ముందు సెల్ఫీ తీసుకున్నాడు. అది గమనించిన సిబ్బంది అతనిపై దాడి చేశారు. అంతలోనే యజమాని శ్రీనివాస్‌గౌడ్ సైతం వచ్చి ఫొటో ఎందుకు తీశావంటూ దాడిచేయడంతో సిబ్బంది రెచ్చిపోయి విచక్షణారహితంగా కొట్టారు. కర్రలతో కొట్టడంతో వీపు, కాళ్ల వాతలతో కమిలిపోయాయి. ముఖంపై గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వైన్స్ యజమానితోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దళిత శ్మశానవాటిక రోడ్డు ధ్వంసం



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘ నాయకులు, గ్రామస్తులు

నిందితులపై అట్రాసిటీ నమోదు చేయాలని కేవీపీఎస్ నాయకుల డిమాండ్

యాలాల: దళిత శ్మశానవాటికకు వేసిన సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన దళిత సంఘం నేతలతో కలిసి శుక్రవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. మండలంలోని రాస్నం గ్రామంలో సర్వే నంబరు 129లో ఎకరా భూమిలో దళితుల శ్మశానవాటిక ఉందన్నారు. దానికి గతంలో సీసీ రోడ్డును ప్రభుత్వ నిధులతో వేసినట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన కొందరూ వ్యక్తుల ప్రోద్బలంతో రఫీక్, యూసుబ్, మక్తర్, ముఖీద్‌లు దౌర్జన్యంగా అర్ధరాత్రి వేళ జేసీబీ సాయంతో శ్మశానవాటిక సీసీ రోడ్డును ధ్వంసం చేశారన్నారు. దీన్ని అడ్డుకోబోయిన వారిపై కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశప్ప, బాలప్ప, నర్సింహులు, సాయిలు, అంజిలప్ప, భాస్కర్, లక్ష్మప్ప, వీరప్ప, అంజిలయ్య తదితరులు ఉన్నారు.

పోలేపల్లికి పోటెత్తిన భక్తులు



ఆలయం ఎదుట జన సందోహం

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లిలో స్వయంభూగా వెలిసిన రేణుక ఎల్లమ్మ దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన జనాలు అమ్మవారికి బోనాలు, కోడి పుంజులు, మేకపోతులతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం, మంగళవారం, ఆదివారం రోజులలో అమ్మవారిని దాదాపు ఐదు వేలకు పైగా మంది భక్తులు దర్శించుకుంటున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు నిండిపోయారు.

దేశంలో మతోన్మాద పాలన

సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

శంకర్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఐ 12వ మహాసభ ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దేశంలో మతోన్మాద పాలన కొనసాగిస్తుందన్నారు. అదే విధంగా కార్మికులకు నల్ల చట్టాలపై ఇచ్చిన హామీలపై మాట మార్చుతుందని, మావోయిస్టులపై జరుపుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు సుధీర్, నాయకులు సుభాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన చిన్నారులు క్షేమం

శంకర్‌పల్లి: ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారుల కథ చివరికి సుఖాంతం అయింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సేడం తాలుకాలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్, నాగమ్మలు దంపతులు. వీరు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బంగ్లగడ్డకి వచ్చారు. అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వీరికి రేణుక(13), సంతోష్(8) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాఠశాలలకు సెలవులు రావడంతో సొంతూరికి వెళ్లిన పిల్లలిద్దరూ ఇటీవల శంకర్‌పల్లికి వచ్చారు. ఇంట్లో ఇతర విషయాలపై తల్లి మందలించడంతో చిన్నారులిద్దరూ కలిసి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేశారు. చివరికి చిన్నారులు ఇద్దరూ వారి సొంత ఊరిలో తన చిన్నాన్న ఇంటికి చేరుకున్నట్లు గుర్తించారు. చిన్నారులు కనిపించకకుండా పోయారనే వార్తతో శుక్రవారం శంకర్‌పల్లి అంతా అలజడి వాతావరణం నెలకొంది.